పనులు ప్రారంభమయ్యేనా?

- ఏడాది కిందట పాఠశాల భవనాలు కూల్చివేత
- టెండర్ల పేరుతో కాలయాపన



గట్టు ఉన్నత పాఠశాల(ఫైల్)

గట్టు: పాఠశాలలో మౌలిక వసతులు కల్పన, పాత భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో గతేడాది అధికారులు కూల్చివేశారు. మొత్తం ఏడు తరగతి గదులను నేల మట్టం చేశారు. ఇంకా పాత భవనంలో 5 తరగతి గదులు ఉన్నాయి. ఈ గదులలోనే గతేడాది 6 తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠాలు బోధించారు. అరకొర వసతులతోనే నెట్టుకొచ్చారు. కొత్త భవనాలు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థుల భవిష్యత్‌పై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏడాది గడుస్తున్నా కనీసం పనులు ప్రారంభించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు రెండు, మూడు పర్యాయాలు పాఠశాలను సందర్శించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే భవనాల కొరత. కొత్త భవనాల నిర్మాణం కోసమంటూ ఉన్న వాటిని నేల మట్టం చేసుకుని బిత్తర చూపులు చూసే పరిస్థితి గట్టు ఉన్నత పాఠశాలలో నెలకొంది. ఉన్నత పాఠశాలలో మొత్తం 520 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలకు గట్టు, ఆరగిద్ద, గొర్లఖాన్‌దొడ్డి, సల్కాపురం, పెంచికలపాడు గ్రామాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు.

అయోమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు

ఉన్న తరగతి గదులను కూల్చడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థుల ఇబ్బందులు పడుతుండటంలో పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు. ముందస్తు చూపు లేకుండా అధికారుల పాత భవనాలను కూల్చడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

మూడు పాఠశాలలకు టెండర్లు

గట్టు ఉన్నత పాఠశాలకు ఇప్పటివరకు టెండర్లు పిలవలేదు. మాచర్ల ఉన్నత పాఠశాలలో వివిధ పనులు చేపట్టేందుకు రూ.52 లక్షలు మంజూరయ్యాయి. తప్పెట్లమొర్సు ఉన్నత పాఠశాలకు రూ.42 లక్షలు మంజూరు చేశారు. మాచర్ల, తప్పెటమొర్సు గ్రామాలలో పనులు చేసేందుకు కొందరు ముందుకు వచ్చినా అధికారులు సాంకేతిక కారణంగా రద్దు చేశారు. మండలంలోని వివిధ పాఠశాలలో టెండర్లు లేని చోట నామినేటెడ్ పనులు ముగింపు దశకు వచ్చాయి.



గట్టులో ఉన్నత పాఠశాలలో కూల్చిన భవనాలు

గదుల కొరత ఉంది



గట్టు ఉన్నత పాఠశాలలో గదుల కొరత తీవ్రంగా ఉంది. పిల్లలు చెట్ల కింద కూర్చుని చదువుకునే పరిస్థితి నెలకొంది. కొత్త భవనాల నిర్మాణాల కోసం పాత భవనాలను కూల్చారు. ఏడాది కిందట కూల్చిన ఇప్పటికీ పనులు ప్రారంభించ లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– ఆంజనేయులు, గట్టు

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

మండల కేంద్రంలో ఉన్న ఉన్నత పాఠశాలకు రూ.కోటి 20 లక్షలు మంజూరయ్యాయి. మొదట్లో 5 గదులు నిర్మించాలనుకున్నాం. మరో అదనపు గది అవసరం ఉన్నందున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. దీంతో మొత్తం ఆరు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. టెండర్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి, సకాలం పూర్తి చేయిస్తాం.

–రవీందర్, డిప్యూటీ ఈఈ, పీఆర్, గద్వాల

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

అయిజ: సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 23వ తేదీ ఆదివారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కేజీబీవీ ఎస్‌ఓ, ఎగ్జాం చీఫ్ సూపరింటెండెంట్ చెన్న బసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్‌లో ఏవైనా తప్పులుంటే బోనఫైడ్ సర్టిఫికెట్‌ను తీసుకొని రావాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇస్తామని తెలిపారు. మిగతా వివరాలకు 9640476494 లేదా 9052293665 సంప్రదించాలని కోరారు.

గట్టు: సాంఘిక సంక్షేమ గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు కస్తూర్బాగాంధీ విద్యాలయ ఎస్‌ఓ అరుణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయ పరీక్షా కేంద్రంలో 300 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కృష్ణవేణి ఐటీఐ కాలేజీలో ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. రంజాన్ తోఫా, ఇఫ్తార్ ఇస్తున్న ప్రభుత్వానికి మత పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ బాల్‌రాజు, ఏఎస్ఐ అయ్యన్న, ఎంపీటీసీ రాజశేఖర్, ఉప సర్పంచ్ సయ్యద్ రెహ్మాన్, రఫీక్, హనీఫ్, ఖతాల్, ఖాజా, మక్తర్ బాషా, గౌస్, అలీబాషా, పెద్దబాస్ మియ్యా, వెంకటేష్ గౌడ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

గద్వాల క్రైం: మద్యంతాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం గద్వాల ట్రాఫిక్ వింగ్ కార్యాలయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. వాహనాదారుడు లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, ఆర్‌సీ ధ్రువపత్రాలు తప్పనిసరి అని పేర్కొన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్, త్రిబుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. ఎవరైన నిబంధనాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు మద్యంతాగి వాహనాలు నడిపితే జరిగే నష్టాలను వీడియో ద్వారా అవగాహన కల్పించారు.

ఆరోగ్యంపై అవగాహన



అయిజ: విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన ఉండాలని ఆయుర్వేద డిస్పెన్సరీ, మెడికల్ ఆఫీసర్ శిల్ప అన్నారు. మండలంలోని మేడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆమె ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన రాగి ముద్దతో చేసిన లడ్డూలు, హల్వాను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కర్రెప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతాయని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారంను తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

అయిజ: తెలంగాణ డిగ్రీ గురుకుల కళాశాల ప్రవేశానికి సంబంధించిన ప్రవేశ పరీక్షల్లో అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించినట్లు ప్రిన్సిపాల్ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని అరవింద్ 7వ ర్యాంక్, అజయ్ 12, మహబూబ్ బాషా 21, భీమేష్ 25, కలెంద్ర 33, తిరుమలేష్ 113, అఖిల 302 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభకనబరచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు.

బీజేపీ నాయకుల విమర్శలు సరికావు



అయిజ: మంత్రి నిరంజన్‌రెడ్డిపై బీజేపీ నాయకులు చేస్తున్న విమర్శలు సరికావని సింగిల్‌విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రిపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని కోరారు. అసత్య ప్రచారాలు మానుకోవాలని లేనిపక్షంలో ప్రజలే వారికి బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న పాల్గొన్నారు.

నాయకులకు సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: పరిపాలన సౌలభ్యం కోసం ప్రజల ఆకాంక్ష మేరకు ఎర్రవల్లిని నూతన మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం కృషి చేసిన ఢిల్లీ అధికార ప్రతినిధి మందా జగన్నాథం, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, అలంపూర్ బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జ్ మందా శ్రీనాథ్‌లకు మండల సాధన సమితి నాయకులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు వారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సాధన సమితి నాయకులు రాఘన్న, లక్ష్మన్న, జోగుల రవి, రాముడు, వెంకటేష్, జమ్మన్న, తదితరులు ఉన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి



బల్గెరలో వివరాలను తెలుసుకుంటున్న సీడీపీఓ

గట్టు: వేసవిలో గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మల్దకల్ ప్రాజెక్టు సీడీఓపీఓ కమాలాదేవి అన్నారు. శుక్రవారం బల్గెరలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బరువు తక్కువ పిల్లలపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక దృష్టిని సారించాలని కోరారు. ప్రతి నెలా గ్రామీణ ఆరోగ్య పారిశుద్ధ్య దినోత్సవం వైద్యాధికారులతో నిర్వహించాలని సూచించారు. సరుకుల నిల్వలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. రక్త హీనత లోపాల నుంచి మహిళలను కాపాడుకునేందుకు గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వాసంతి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

కొనసాగుతన్న వీఓఏల నిరసన

గట్టు: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ కోరారు. వివిధ గ్రామాలకు చెందిన వీఓఏలు మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య దగ్గర చేపట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వీఓఏల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పలు గ్రామాలకు చెందిన వీఓఏలు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు.

కేటీదొడ్డి: వీఓఏల డిమాండ్లు నెరవేర్చాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వీఓఏల సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మిక చట్ట ప్రకారం కనీస వేతనం ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, తిమప్ప తదితరులు ఉన్నారు.



గట్టులో వీఓఏలకు సంఘీభావం తెలుపుతున్న మాచర్ల ప్రకాష్

గద్వాల రూరల్: మండలంలోని ఐకేపీ కార్యాలయం వద్ద ఐదో రోజు శుక్రవారం వీఓఏల సమ్మెల కొనసాగింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, కనీస వేతనం కనీసం రూ.26వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల సాధారణ బీమా ఇవ్వాలని, వీఓఏలకు ఒకే రకమైన యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డ్యాం అంజి, రాధమ్మ, తిమ్మప్ప, వెంకటేష్, సుధాకర్, రేణుక, వరలక్ష్మి, బీసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఉపాధి కూలీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

మల్దకల్: జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఉపాధి హామీ పనుల కల్పిస్తామని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో వందమంది కూలీలకు తగ్గకుండా పనులు చేపట్టాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేపట్టాలని సూచించారు. కొన్ని గ్రామాలలో పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామాలలో ఎంపికైన సీనియర్ మేటీలకు ఉపాధి హామీ పనులపై ప్రత్యేక అవగాహన కల్పించేందుకు కార్యచరణ రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్ కుమార్, ఏపీఓ స్వామి, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు

ధరూరు: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జ్ చైర్మన్, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి అనిరోజ్ క్రిష్టియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల వలన పంట నష్టం వాటిల్లితే రైతులు న్యాయ సలహా కేంద్రాన్ని ఆశ్రయించాలన్నారు. అలాగే మార్కెట్‌లో మోసాలు, పంటబీమా అమలు కాకపోతే న్యాయ సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితాదేవి, అదనపు సినియర్ సివిల్ జడ్జి ప్రభాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందనాయక్, ఏఓ శ్రీలత, జెడ్పీటీసీ పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ పద్మమ్మ, ఎస్ఐ శేఖర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి అనిరోజ్ క్రిష్టియన్

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

మల్దకల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాజారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని నేతువానిపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచు వీరేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, డాక్టర్ నవీన్ కుమార్, స్వరూపరాణి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని తారాపురంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ నల్లన్నగౌడ్, వైద్యాధికారి సౌజన్య శుక్రవారం ప్రారంభించారు. అదేవిధంగా ఆరగిద్ద, ఇందువాసి గ్రామాల్లో కూడా కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. మూడు గ్రామాల్లో మొత్తం 444 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 26 మందికి కంటి అద్దాలను పంపిణీ, 29 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, పాల్గొన్నారు.

పురోహిత సంఘం అధ్యక్షుడిగా అడవిస్వామి

రాజోళి: తెలంగాణ జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అడివిస్వామిని ఎన్నుకున్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో గద్వాల జిల్లా అధ్యక్షుడిగా అడివస్వామి ఎన్నికయ్యారు.

గడ్డివాము దగ్ధం



అలంపూర్ రూరల్: మండలంలోని ర్యాలంపాడ్‌లో ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రఫీ గ్రామం శివారులో గడ్డివాము, శనగపొట్టు ఏర్పాటు చేశాడు. ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయని తహసీల్దార్ సుభాష్ నాయుడు తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది ఘటన స్థలాన్ని తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ శ్రీవాణి పరిశీలించారు. దాదాపు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



ఉండవెల్లి: మండల కేంద్రంతో పాటు, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు, శేరుపల్లె, మారమునగాల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని బీఎస్పీ ఆధ్వర్యంలో బస్సు దీక్ష చేపట్టారు. శుక్రవారం మారమునగాలో బీఎస్పీ నాయకులు ప్రభుదాసు, శివ, వెంకటేశ్వర్లు, ఈశ్వర్, నరేష్, సూరి బస్సు దీక్షలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్‌టీసీ అధికారుల స్పందించి విద్యార్థుల, ప్రజల సౌకర్యార్థం బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. మండల కేంద్రానికి వెళ్లేందుకు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విక్రమ్, అయ్యన్న, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నిపాడులో సువార్త మహాసభలు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో 23, 24, 25వ తేదీలలో ఎంబీ బేతేలు చర్చి మూడో వార్షికోత్సవం పురస్కరించుకొని సువార్త మహాసభలు నిర్వహిస్తున్నామని చర్చి పాస్టర్ చార్లెస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా రెవరెండ్ ఇమ్మానియెల్, దైవారాధన రేడియో ప్రసంగీకులు నంద్యాల, బ్రదర్ శామ్యూల్ కర్నోజి అంతర్జాతీయ ప్రసంగీకులు మిరాకిల్ సెంటర్ వైజాక్, డాక్టర్ జాన్‌వెస్లీ హాజరవుతారని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి



గద్వాల: ఆధ్యాత్మికతతో ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలని పలువురు పండితులు సూచించారు. గద్వాల రాఘవేంద్ర సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన 'హరిదాసోత్సవము– దాస సాహిత్యము' వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ప్రముఖ పండితుడు సుళాది హనుమేశచార్యులు ప్రవచనాలు వినిపించారు. అంతకుముందు మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం మహిళా భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపిస్తు గ్రామ ప్రదక్షణ చేపట్టారు. శేషదాస భజన మండలి, రాఘవేంద్ర భజన మండలి సభ్యులు భజనలు నిర్వహించారు. రాయచూర్‌కు చెందిన వెంకోబరావు గంగాఖేడ్, వరదేంద్రగంగాఖేడ్‌ల చేత దాసవాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

సామాజిక అంశాలపై అవగాహన



పర్దిపురంలో మాట్లాడుతున్న పోలీసులు



జింకలపల్లిలో హాజరైన గ్రామస్తులు

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని జింకలపల్లిలో శుక్రవారం ఇటిక్యాల పీఎస్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్, పోలీస్ కళా బృందం సభ్యులు గ్రామస్తులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, డయల్ 100, పోలీస్ చట్టాలపై పాటలు, మాటల రూపంలో వివరించారు. అనంతరం ఎస్ఐ గోకారి మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం ఉంటే వెంటనే డయల్ 100కు తెలపాలని కోరారు. ఎక్కడైనా విద్యార్థులు, మహిళలు వేధింపులకు గురైతే షీ టీమ్ నంబర్లకు 8712670312, 799313139 ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అయ్యన్న, షీ టీమ్, కళాబృందం సభ్యులు రాధమ్మ, రాంరెడ్డి, శేషన్న, కృష్ణ, రామాంజనేయులు, దివ్యవాణి, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అయిజ: మండలంలోని పర్దిపురంలో శుక్రవారం శాంతినగర్ సీఐ శివశంకర్ గౌడ్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సరైన పత్రాలు లేని 25 మోటర్ సైకిళ్లను గుర్తించారు. అదేవిధంగా గ్రామస్తులకు 4జీ, సైబర్ నేరాలపై నేరాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా సీసీ కెమరాల ప్రాముఖ్యతను వివరించారు. బాల కార్మికులు, మహిళలపై జరిగే నేరాలు, వాహన, ఇతర చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో అయిజ, శాంతినగర్, రాజోళి, ఎస్ఐలు సురేష్‌కుమార్, శ్రీనివాసులు, కురుమన్న, 23 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయండి

అయిజ: బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించే బహుజన రాజ్యాధికార యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు గౌడ్, నరసింహ గౌడ్, రాముడు, హనుమన్న, చిన్న, రవి, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కేశవరావు

29న 'చలో హైదరాబాద్'కు తరలిరావాలి



ఉండవెల్లిలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్మికులు

ఉండవెల్లి: హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 29న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఎదుట ధర్నా నిర్వహిస్తునట్లు సీఐటీయూ కార్యదర్శి వెంకటేశ్వర్లు, హమాలీ సంఘం అధ్యక్షుడు వెంకట్రాముడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కార్మికులతో కలిసి ఆయన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. హమాలీ, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, గోదాములలో పని చేస్తున్న వారికి నాల్గో తరగతి ఉద్యోగాలు, కార్మికులందిరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాండు, వెంకటేశ్వర్లు, నరసింహ, శేఖర్, మహేష్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఈ నెల 29న చేపట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని హమాలీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని మాచర్లలో ఆయన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాయాపురం నర్సింహులు, చెంగటి నర్సింహులు, రాజప్ప, మౌలాలి, తిమ్మప్ప, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.